**82**
**ధారావాహిక**



**జరిగిన కథ :** పురనివాసం మొదటి అంతర్వు వసారాలో నిలబడి వీధులను పరికిస్తున్నాడు జాయపుడు. చిన్నగా వర్షం కురుస్తున్నది. చీకటి, వర్షం కలగలిసిన వింత సవ్వడిలో.. వీధి చివరి నుంచి అశ్వంపైన ఓ మహిళ అటు వైపే వస్తుండటం గమనించాడు. ఆమె ఆహార్యం, ఆభరణాల మెరుపు చూస్తే.. కులీన మహిళ లాగే ఉన్నది. వచ్చివచ్చి జాయపుని నివాసం దగ్గర గుర్రం దిగింది. తలపై ఉన్న ముసుగు తొలగించి.. తలపైకెత్తి జాయపుణ్ని చూసింది. ఆమెను చూడగానే.. అతని ఒళ్లు జలదరించింది. ఆమెను గుర్తించాడు.

# జాయ సేనాపతి

మత్తి భానుమూర్తి
99893 71284

చారిత్రక కాల్పనిక నవల

ఆమె ఇంద్రాణి..

గబగబా కిందికి దిగి వచ్చాడు. భవనపు ముందున్న వసారాలోని కాగడా వెలుగులో.. ఆమె.

పూర్తిగా తడిసిన అలంకృత నూతన వధువు. పాపిట నుంచి కారుతున్న నీటిధార నుదుటనున్న కల్యాణ తిలకాన్ని తాకుతున్నది. కళ్ల నుంచి కారుతున్న నీరు.. తుడిచినప్పుడల్లా ఓ చెంప బుగ్గచుక్కను.. మరో చెంప పెదవుల లత్తుకనూ స్పృశిస్తున్నాయి.

ఆమె దుఃఖంతో మిళితమైన ఊపిరి పీల్చి వదలినప్పుడల్లా తడిసిన ఎద ఎగసిపడుతున్నది.

''లోపలికి రండి ఇంద్రాణిదేవి!'' అన్నాడు జాయప.

బయట వర్షం పెరిగింది. ఇంద్రాణి దుఃఖగీతానికి వాద్య ఘోషలా.. మధ్య మధ్య ఉరుములు మెరుపులు!

ఉత్తరీయం అందించాడు. ఆమె మౌనంగా అందుకుని వినీల కచభరాన్ని ఆ ఉత్తరీయంలో చుట్టింది. జాయపుడు విచిత్రమైన మనఃస్థితిలో ఉన్నాడు. ఈవిడ గారు ఎందుకు వచ్చినట్లు?!

ఆమె అన్నది..

''మేము.. నేను వివాహవేడుక నుంచి వచ్చేశాను..''

వర్షంలో మాటలు కూడా తడిసినట్లు.. ఆమె మాటలు అదోలా అనిపిస్తున్నాయి.

వెంటనే అన్నాడు..

''ఏమి? ఎందుకు??''.

''మీకోసం. నేను తప్పుచేశాను. తమరిని నిరాకరించి పెద్ద తప్పు చేశాను. నా తప్పు ఏమిటో తెలుసుకున్నాను. అందుకే, నా ఈ తప్పు బతుకంతా నన్ను.. ఇతరులను బాధ పెట్టకూడదని వచ్చేశాను. మిమ్మల్ని నమ్మి వచ్చేశాను!''.

''ఇప్పుడు ఇలా రావడం అతిపెద్ద తప్పు ఇంద్రాణి దేవి. నేను ఏ విధంగానూ మీకు తగినవాడను కాదు. అప్పుడు మీరు మంచినిర్ణయం తీసుకున్నారు. నన్ను తిరస్కరించారు''.

''అదే.. అదే నేను చేసిన పెద్దతప్పు. మీకు తెలియకుండా నేను మీపై వేగులను నియోగించాను. మీకు.. మీకు ఆ అమ్మాయి వల్ల జరిగిన నష్టం నిన్ననే నా దృష్టికి వచ్చింది. ఇక ఆగలేకపోయాను. పెళ్లిపందిరి నుంచి వచ్చేశాను. నాకు మీరే తగిన భర్త.. ఇది నా అంతిమ నిర్ణయం!''.

కాకతి ఉదంతం ఇంద్రాణికి పూర్తిగా తెలిసింది.

ఏదో చెప్పబోయాడు. నివాసం ముందు కలకలం.. పది పదిహేను గుర్రాలు ఆగాయి. రౌతులు దిగుతున్నారు. ముందు కనిపించినవాడు పుళిందపుడు. భయంభయంగా చూస్తూ వంగి, వంగుతూ చేతులు పిసుక్కుంటూ ముందుకు వచ్చాడు. అతణ్ని చూడగానే జాయపుని దవడలు బిగుసుకున్నాయి.

''క్షమించాలి సేనానీ.. ఇంద్రాణిదేవి ఇలా చేయడం రాజనగరికే అవమానం. మహామండలీశ్వరులు కూడా వివాహానికి హాజరయ్యారు. మీ అభిప్రాయం?''.

''ఇంద్రాణిదేవి ఇలా వచ్చేయడం నేను సంపూర్ణంగా వ్యతిరేకిస్తున్నాను. అదే ఆమెకు చెప్పాను. ఆమెను మీరు తీసుకువెళ్లవచ్చు''.

పుళిందపునితో వచ్చిన ఆగంతుకులు లోపలికి వెళ్లి ఇంద్రాణిని పట్టుకోబోయారు. జాయపుడు మెరుపువేగంతో వాళ్లకు అడ్డునిలబడి ఆమెను తాకనివ్వలేదు.

''బయటికి పొండి. నా అనుమతి లేకుండా నా ఇంట్లోకి కాలు పెట్టడానికి ఎన్ని గుండెలు కావాలి?''..

పుళిందపుడు ముందుకొచ్చి వాళ్లను వెనక్కి లాక్కుపోయాడు. జాయపుడు ఆమె దగ్గరగా వెళ్లాడు. ఆమె తలవొంచుకుని వెక్కివెక్కి ఏడుస్తున్నది.

అప్పుడన్నాడు జాయపుడు..

''తమరు బయటికి ఏడుస్తున్నారు. నేను లోపల ఏడుస్తున్నాను ఇంద్రాణిదేవి. మీరు సాహసం చేసి నా వద్దకు వచ్చేశారు. కానీ, నేను ఆహ్వానించే మానసికస్థితిలో లేను. ఆ అమ్మాయి వెళ్లిపోయింది కనుక ఆ స్థానాన్ని భర్తీ చేయగలనని మీరు భావించారేమో. కానీ.. కానీ ఆమె స్థానాన్ని భర్తీ చేయగలవారు ఎవ్వరూ లేరు.. ఉండరు. ఆమె నాతోనే.. నాలోనే ఉంది. దయచేసి మీరు మంచి పట్టమహిషిగా సంతోషంగా ఉంటే నేనెంతో సంతోషిస్తాను''.

చేతులు జోడించి నమస్కరించి ఆమెకు బయటికి దోవ చూపాడు. ఇంద్రాణికి మరోమార్గం లేదు. మరో మాటా లేదు. కళ్లు తుడుచుకుని మౌనంగా బయటికి వెళ్లింది. వాళ్లు తెచ్చిన పల్లకి ఎక్కింది. పల్లకి వెంట అశ్వాలు కదిలాయి.

వాన హెచ్చింది.. ఉరుములు మెరుపులు..

''పుళిందపా..'' అరిచి పిలిచాడు జాయపుడు.

చటుక్కున అశ్వం దిగి పరుగున దగ్గరికి వచ్చాడు.

''ఆమె భర్త ఎవడో!?''.

''మన మిత్రుడు ముమ్మడి సేనానులవారు!''.

''ముమ్మడో గుమ్మడో ఎవడో.. నాకు అనవసరం. కానీ ఆమెకు చిన్నపాటి అసహనం కలిగినా వాణ్ని బతికుండగానే తోలు ఒలిచి ఆమెకు పాదరక్షలు కుట్టిస్తానని నా మాటగా చెప్పు. అప్పుడు నిన్ను ఏం చేస్తానో తెలుసా.. కటికులు నీ తోలు వొలుస్తుండగా నీముందు